క్లుప్తంగా

ఉచిత వైద్యశిబిరం

శాయంపేట : మండల కేంద్రంలోని రైతు వేదికలో లేబర్ కార్డు కలిగిన కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం, సీఎస్సీ హెల్త్ కేర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరం శనివారం రెండో రోజు కొనసాగింది. ఈ సందర్భంగా వైద్యులు, సిబ్బంది కార్మికులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించారు. రిపోర్టు వచ్చాక ప్రముఖ వైద్యులతో అవసరమైన వైద్యసేవలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కందగట్ల రవి, సీఎస్సీ హెల్త్ కేర్ వైద్య సిబ్బంది రాధిక, రవితేజ, సందీప్ పాల్గొన్నారు.

11న ఆత్మీయ సమ్మేళనం



మాట్లాడుతున్న శంకర్‌రెడ్డి

ఐనవోలు : ఈనెల 11న సత్యం గార్డెన్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తామని బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పోలెపల్లి శంకర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని నందనం గ్రామంలో ముఖ్యనాయకులతో శనివారం నిర్వహించిన సన్నాహక సమావేశంలో శంకర్‌రెడ్డి మాట్లాడారు. ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయడానికి చేపట్టాల్సిన కార్యాచరణపై దిశా నిర్దేశం చేశారు. ఆత్మీయ సమ్మేళనానికి అధిక సంఖ్యలో ప్రజలను తరలించే క్షేత్రస్థాయి నాయకులకు తగిన ప్రాధాన్యం ఉంటుందని చెప్పారు. పార్టీ పిలుపులను నిర్లక్ష్యం చేసే వారిని ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. సమావేశంలో ఆ పార్టీ అనుబంధ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు దుప్పెల్లి కొంరయ్య, ఎంపీటీసీ రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

'చైర్మన్ పదవి ఇప్పించండి'



శాయంపేట : తనకు వరంగల్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పదవి ఇప్పించాలని కోరుతూ పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావుకు బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు కొమ్ముల శివ శనివారం వినతిపత్రం అందజేశారు. భూపాలపల్లి జయశంకర్ జిల్లా కేంద్రంలో చేపట్టిన మహాధర్నా కార్యక్రమంలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుకు పాల్గొనగా ఆయన్ను శివ కలిసి వినతిపత్రం అందించి మాట్లాడారు. తనకు గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా నామినేటెడ్ పదవి ఇప్పిస్తే భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, జెడ్పీ చైర్ పర్సన్ గండ్ర జ్యోతి సహకారంతో పార్టీ పటిష్టతకు, గ్రంథాలయ సంస్థ అభివృద్ధికి పాటుపడతానని తెలిపారు.

మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ



కమలాపూర్ : మండల కేంద్రంలో పెద్ద రథోత్సవం సందర్భంగా శనివారం మిత్ర యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భక్తులకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ తక్కళ్లపెల్లి సత్యనారాయణరావు, ఎంపీటీసీలు మెండు రాధిక రమేశ్, వీరమనేని భాస్కర్‌రావు, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కొనిశెట్టి మునీందర్, కస్తూరి సంపత్ కుమార్ చారి, యూత్ అధ్యక్షుడు కస్తూరి శ్రీధర్ చారి, గౌరవ అధ్యక్షుడు ఆడెపు శ్రీకాంత్, సభ్యులు బొజ్జం ప్రశాంత్, చందనాల నాగరాజు, అనిల్, అరుణ్, రాజేందర్, రాజేశ్, సాయివర్మ, కార్తీక్, సిద్దూ, వేదాంశ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ పరామర్శ



ధర్మసాగర్ : మండలంలోని ముప్పారం గ్రామానికి చెందిన కోరుకొప్పుల నారాయణ, గుంటిపెల్లి భారతయ్య ఇటీవల వేర్వేరు కారణాలతో మృతి చెందగా బాధిత కుటుంబాలను మాజీ డిప్యూటీ సీఎం, ఎమ్మెల్సీ కడియం శ్రీహరి శనివారం పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. తొలుత మృతుల చిత్రపటాలకు నివాళులర్పించారు. ఆయన వెంట ధర్మసాగర్ సర్పంచ్ ఎర్రబెల్లి శరత్, ముప్పారం మాజీ ఎంపీటీసీ మేకల విజయ్‌కుమార్, శ్యామల రమేశ్‌రెడ్డి, సాంబరాజు, వెంకట్రాజం, కుమారస్వామి, కడియం యువసేన సభ్యులు తదితరులున్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

హసన్‌పర్తి : 1వ డివిజన్ ఎర్రగట్టు నారాయణనగర్‌కు చెందిన వి.లక్ష్మణ్‌కు మంజూరైన రూ.60 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును హనుమకొండలోని తన స్వగృహంలో ఎమ్మెల్యే అరూరి రమేశ్ శనివారం అందించి మాట్లాడారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సిరంగి సునీల్‌కుమార్, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు నరేడ్ల శ్రీధర్, చల్లా వెంకటేశ్వర్‌రెడ్డి, మణీందర్‌నాథ్, నాయకులు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్లను అనుమతించొద్దు

● వరంగల్ సీపీ రంగనాథ్



ఐనవోలు : విజిటింగ్ రిజిస్టర్‌లో సంతకం చేస్తున్న సీపీ రంగనాథ్

ఐనవోలు : పదో తరగతి పరీక్షా కేంద్రంలోకి ఎంతటి అధికారులవైనా సెల్‌ఫోన్లను అనుమతించొద్దని వరంగల్ పోలీస్ కమిషనర్ (సీపీ) రంగనాథ్ స్పష్టం చేశారు. మండలంలోని పున్నేలు గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని శనివారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. పరీక్ష నిర్వహణను ప్రత్యక్షంగా పరిశీలించారు. పరీక్షా కేంద్రం వద్ద విధులు నిర్వహిస్తున్న ఎంపీడీఓ వెంకటరమణ, పరీక్ష కేంద్ర సూపరింటెండెంట్‌లతో పరీక్ష రాస్తున్న విద్యార్థుల సంఖ్య, ఇతర వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం సీపీ మాట్లాడారు. సంబంధం లేని వ్యక్తులను పరీక్షా కేంద్రంలోకి అనుమతించొద్దని, ఏ స్థాయి అధికారినైనా సెల్‌ఫోన్‌తో అనుమతించొద్దని స్పష్టం చేశారు. బందోబస్తుపై పోలీసులకు సూచనలు అందించారు. అనంతరం విజిటింగ్ రిజిస్టర్‌లో సంతకం చేశారు. ఆయన వెంట ట్రెయినీ ఐపీఎస్ అంకిత్ కుమార్, ఎస్సై గుగులోతు వెంకన్న ఉన్నారు.

బందోబస్తు నడుమ పరీక్ష



ఆత్మకూరు : హైస్కూల్ వద్ద పోలీస్ బందోబస్తు



కమలాపూర్ : సూచనలు చేస్తున్న ఇన్‌స్పెక్టర్

ఆత్మకూరు : మండల కేంద్రంలోని పదో తరగతి పరీక్ష కేంద్రాల వద్ద పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. పటిష్టమైన భద్రత నడుమ గణిత పరీక్ష జరిగింది. స్థానిక ప్రభుత్వ జెడ్పీ హైస్కూల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, సెయింట్ థెరిసా స్కూల్‌లో పరీక్షా కేంద్రాలుండగా సీఐ కుమార్ పోలీసు బందోబస్తును పర్యవేక్షించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటన చోటు చేసుకోకుండా ఎస్సైలు ప్రసాద్, అనిల్ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. ప్రతిఒక్కరినీ క్షుణ్ణంగా తనిఖీ చేశారు.

పరీక్షా కేంద్రానికొచ్చి వెనుదిరిగిన విద్యార్థి

కమలాపూర్ : మండల కేంద్రంలో ఈనెల 4న హిందీ ప్రశ్నపత్రం లీకైన ఘటనలో డీబారైన విద్యార్థి దండెబోయిన హరీశ్ శనివారం స్థానిక బాలుర హైస్కూల్‌లోని పరీక్షా కేంద్రానికి వచ్చి వెనుదిరిగి వెళ్లిపోయాడు. హిందీ ప్రశ్నపత్రం లీకైన ఘటనలో హరీష్‌ను విద్యా శాఖ అధికారులు డీబార్ చేయగా పరీక్షలు రాయడానికి కోర్టు అనుమతి ఇస్తుందేమోనన్న ఆశతో హరీష్ కుటుంబ సభ్యులతో కలిసి పరీక్షా కేంద్రం వద్దకు కాస్త ఆలస్యంగా చేరుకున్నాడు. అప్పటికే పరీక్ష ప్రారంభం కావడంతోపాటు హరీష్ పరీక్ష రాయడానికి అనుమతి రాకపోవడంతో సిబ్బంది హరీశ్‌ను పంపించి వేశారు.

ఫ్లయింగ్ స్క్వాడ్, పోలీసుల సందర్శన

కమలాపూర్‌లోని జిల్లా పరిషత్ బాలుర, బాలికల హైస్కూళ్లలో ఏర్పాటు చేసిన పదో తరగతి పరీక్ష కేంద్రాలను స్థానిక పోలీస్ ఇన్‌స్పెక్టర్ బొలుమల్ల సంజీవ్, ఎస్సై మోటం సతీశ్ శనివారం వేర్వేరుగా సందర్శించారు. పరీక్షల నిర్వహణ తీరును, బందోబస్తును పరిశీలించారు. ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం సైతం మండలంలోని నాలుగు పరీక్షా కేంద్రాలను సందర్శించి పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించి తనిఖీలు నిర్వహించారు.

తగ్గి ఉంటేనే ఏసుక్రీస్తుకు ఇష్టం

● క్రీస్తుజ్యోతి మినిస్ట్రీస్ ఫౌండర్ రెవరెండ్ డాక్టర్ పాల్సన్ రాజ్



శిష్యుల పాదాలు కడుగుతున్న పాల్సన్ రాజ్

ధర్మసాగర్ : సమాజంలోని ప్రతిఒక్కరూ తగ్గి ఉండడమే లోక రక్షకుడైన ఏసుక్రీస్తుకు ఇష్టమని క్రీస్తు జ్యోతి మినిస్ట్రీస్ ఫౌండర్ రెవరెండ్ డాక్టర్ సంగాల పాల్సన్ రాజ్ తెలిపారు. మండలంలోని కరుణాపురం గ్రామంలో సొసైటీ ఆఫ్ క్రైస్ట్ ప్రధాన కార్యదర్శి రెవరెండ్ డాక్టర్ జయప్రకాశ్ గోపు అధ్యక్షతన 12 మంది శిష్యుల పాదాలను పాల్సన్ రాజ్ శనివారం కడిగారు. అనంతరం పాల్సన్ రాజ్ మాట్లాడారు. ఏసుక్రీస్తును కరుణామయుడిగా అభివర్ణించారు. ఏసుక్రీస్తు శిష్యులకు పరలోక మర్మాలు వివరించారని తెలిపారు. మానవుడు నిత్యజీవితంలో తగ్గి ఉండాలని ఏసుక్రీస్తు చెప్పారన్నారు. తగ్గి ఉండే వారు ఉన్నతులుగా ఎదుగుతారని, ఉన్నతులమంటూ గర్వపడేవారు దిగజారుతారని వివరించారని తెలిపారు. తమను తాము ఉన్నతులుగా భావిస్తూ మానవులు గర్విష్టులుగా జీవిస్తుండడం వల్లే ప్రస్తుతం అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అలాంటి వ్యక్తులు ఇకనైనా తగ్గి ఉండడాన్ని అలవర్చుకుని యేసుక్రీస్తు మార్గంలో పయనించాలని సూచించారు. ఏసుక్రీస్తు బోధనలు నేటి సమాజానికి అనుసరణీయమని చెప్పారు. రెవరెండ్ డాక్టర్ జయప్రకాష్ గోపు మాట్లాడుతూ పాల్సన్ రాజ్ ఏటా శిష్యుల పాదాలు కడిగే కార్యక్రమాన్ని తప్పకుండా నిర్వహిస్తున్నారని అభినందించారు. వేదికపై విశ్వాసుల సమక్షంలో పాల్సన్‌రాజ్ శిష్యుల పాదాలు కడగడం అందరి హృదయాలను కదిలించింది. పలువురు కంటితడి పెట్టారు. కార్యక్రమంలో సంగాల యిర్మియా, గోపు జయపాల్, రవిపాల్, జోసెఫ్, ప్రభాకర్, ఫిలిప్, ఆరోగ్యరాజ్, ఎస్.డేవిడ్, డాక్టర్ ప్రదీప్, ఆంధ్రయ్య, హనోక్, సామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం అభినందనీయం

● రెడ్‌క్రాస్ చైర్మన్ డాక్టర్ విజయ్‌చందర్‌రెడ్డి



రక్తదాతలకు ప్రశంసపత్రం అందజేస్తున్న చైర్మన్

దామెర : రక్తదానం అభినందనీయమని రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ డాక్టర్ పెసరు విజయ్‌చందర్ రెడ్డి తెలిపారు. మండలంలోని ల్యాదెల్ల గ్రామంలో ఆ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఆరోగ్యవంతులైన ప్రతిఒక్కరూ ఆర్నెళ్లకోసారి రక్తదానం చేయొచ్చని తెలిపారు. రక్తదానం పట్ల యువత అపోహలు వీడి ముందుకు రావాలని సూచించారు. రక్తదానం చేయడాన్ని తలసీమియా బాధితులకు పునర్జన్మ ఇవ్వడంలా అభివర్ణించారు. రక్తదాతలకు సర్టిఫికెట్ అందజేశారు. కార్యక్రమంలో శ్రీకాంత్, రాజ్‌కుమార్, సుమంత్, సాయికుమార్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గోవిందరాజుల రథోత్సవం



పుర వీధుల్లో కొనసాగుతున్న రథోత్సవం

వరంగల్ చౌరస్తా: గోవిందరాజ స్వామి పెద్ద రథోత్సవం వైభవంగా సాగుతోంది. మూడవరోజు శనివారం వరంగల్‌లోని గిర్మాజీపేట సత్య హాస్పిటల్ వరకు రథయాత్ర చేరుకుంది. డప్పు వాయిద్యాలతో కళాకారుల కోలాట ఆటపాటలతో పుర వీధుల్లో పెద్దరథాన్ని రథసారథులు ముందుకు తీసుకెళ్లారు. బీఆర్‌ఎస్ నాయకులు కూచన క్రాంతి కుమార్, మట్టెవాడ ఆనంద్ రావు మిత్రులు అన్నదానం చేశారు. కార్యకమంలో 27వ డివిజన్ కార్పొరేటర్ చింతాకుల అనిల్‌కుమార్, బీఆర్‌ఎస్ నాయకులు చింతాకుల సునీల్ కుమార్, ముదిరాజ్ వంశీయులు ఇప్ప ఆదినారాయణ, పరశు శ్రీనివాస్, సింగినేని శ్రీనివాస్, గోవిందు, రాధాకష్ణ, నరహరి, వంశీ, సాగర్, ఈశ్వర్, శివ పాల్గొన్నారు.

దాడి చేసిన వ్యక్తులపై కేసు నమోదు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఓంప్రకాశ్

కాజీపేట: గంగపుత్రులపై దాడి చేసి గాయపర్చిన ముదిరాజ్ కులస్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ ప్రదేశ్ గంగపుత్ర (బేస్త) సంఘం జిల్లా అధ్యక్షుడు పాక ఓంప్రకాశ్ డిమాండ్ చేశారు. కాజీపేట 62వ డివిజన్ రహమత్‌నగర్ కాలనీలో శనివారం రాత్రి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కామారెడ్డి జిల్లా ముత్తాయిపేట గ్రామంలో సొంత హక్కులు కలిగిన చెరువులో దౌర్జన్యంగా ముదిరాజ్‌లు చేపలు పట్టడానికి ప్రయత్నించడమే గాక గంగపుత్రులపై దాడి చేసి గాయపర్చడం అన్యాయమని వాపోయారు. పోలీసులు వెంటనే స్పందించి బాధ్యులను గుర్తించి శిక్షించాలని కోరారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ పాక వెంకటేశ్వర్లు, డైరీ కమిటీ కన్వీనర్ డాక్టర్ గోపు సుధాకర్, కె.వేదప్రకాశ్, ఎ.శ్రీనివాస్, పి.సదానందం, గోపాల్ రావు, కె.రఘు, క్రాంతికుమార్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల డిమాండ్లు నెరవేర్చాలి

ఖిలా వరంగల్: ప్రభుత్వ పెన్షనర్ల డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం నెరవేర్చాలని రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి తిరువరంగం ప్రభాకర్ డిమాండ్ చేశారు. వరంగల్ రైల్వేగేట్ ప్రాంతం శివనగర్‌లో జిల్లా అధ్యక్షుడు పాద సోమయ్య అధ్యక్షతన ప్రభుత్వ రిటైర్డ్ పెన్షనర్ల సమావేశం శనివారం జరిగింది. ముఖ్యఅతిథిగా ప్రభాకర్ మాట్లాడుతూ ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులు అనేక రకాల సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈనెల 10న వరంగల్ కలెక్టరేట్ కార్యాలయం ఎదుట నిర్వహించనున్న దీక్షకు పెన్షనర్లు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీపాద సోమయ్య, లక్ష్మారెడ్డి, యూనిట్ కార్యదర్శి వరయోగుల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రన్ ఫర్ జీసస్



పరకాల : పరకాలలో క్రైస్తవులు రన్ ఫర్ జీసస్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. పట్టణంలోని సీఎస్ఐ చర్చి నుంచి అంబేద్కర్ జంక్షన్, బస్టాండ్, ఆర్టీసీ డిపో వరకు రన్ కొనసాగింది. కార్యక్రమంలో కౌన్సిలర్ మడికొండ సంపత్, సీఎస్ఐ రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు కేజే.థామస్, తోపాటు క్రైస్తవ సంఘ పెద్దలు పాల్గొన్నారు.

వ్యవసాయ మోటార్ల చోరీ



విలేకరులతో మాట్లాడుతున్న బాధితులు

శాయంపేట : మండలంలోని పెద్దకోడెపాక రెవెన్యూ శివారులోని చలివాగు ప్రాజెక్టు తూము వెనుక, కొప్పుల గ్రామానికి వెళ్లే రోడ్డులోని తమ వ్యవసాయ భూముల్లోని నాలుగు 3 హెచ్‌పీ మోటార్లను గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసినట్టు బాధితులు కౌటం మల్లయ్య, చెక్క తిరుపతి, స్వర్గం మొగిలి తెలిపారు. విలేకరుల ఎదుట వారు శనివారం గోడు వెళ్లబోసుకున్నారు. వ్యవసాయ పంటలకు నీరు అందించడానికి వాడుతున్న విద్యుత్ మోటార్లు చోరీకి గురయ్యాయని వాపోయారు. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. నిందితులను త్వరగా గుర్తించి న్యాయం చేయడంతోపాటు దొంగల బెడదను అరికట్టాలని కోరారు.

పోరాట యోధురాలు బేబక్క



వరంగల్ చౌరస్తా: ప్రతిఘటన పోరాట యోధురాలు బేబక్క అని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు అన్నారు. బేబక్క సంతాప సభను జయప్రదం చేయాలని పార్టీ ఖమ్మం, వరంగల్ ఉమ్మడి జిల్లాల ఏరియా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న సంబంధిత వాల్‌పోస్టర్ల వరంగల్ చౌరస్తాలో శనివారం ఆవిష్కరించారు. ఈనెల 10న నర్సంపేటలోని వాసవి కల్యాణ మండపంలో సంతాప సభ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సభలో పార్టీ కార్యదర్శి సాదినేని వెంకటేశ్వరరావు, కార్యదర్శివర్గ సభ్యులు గోవర్ధన్, ప్రగతిశీల మహిళా సంఘం జాతీయ కన్వీనర్ వి.సంధ్య, ప్రజాసంఘాల రాష్ట్ర జిల్లా నాయకులు పాల్గొంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆరెల్లి కృష్ణ, బండి కోటేశ్వరరావు రాచర్ల బాలరాజు, గంద్రాతి హరిబాబు, ఇనుముల కృష్ణ, అక్బర్, బండి రవి, కుమారస్వామి, ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

కేవీపీఎస్ ఆధ్వర్యంలో బైక్ యాత్రలు



నయీంనగర్: ఏప్రిల్ 11న మహాత్మ జ్యోతిబాపూలే, ఏప్రిల్ 14న డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ జయంతుల సందర్భంగా ఏప్రిల్ మాసాన్ని మహనీయుల మాసంగా ప్రకటించి కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా బైక్ యాత్రలు చేపట్టనున్నట్లు కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద సంపత్ తెలిపారు. ఈమేరకు హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మనువాదాన్ని ప్రతిఘటించి రాజ్యాంగాన్ని రక్షించుకోవాలని సూచించారు. రిజర్వేషన్లు, ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణకు బైక్ యాత్రలు చేపట్టినట్టు వివరించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు ఓరుగంటి సాంబయ్య, కావ్యశ్రీ, రాజేందర్, నారాయణ, రాంకీ పాల్గొన్నారు.

ఉద్యోగాల భర్తీలో కేసీఆర్ విఫలం

● వైఎస్సార్‌టీపీ పరకాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆముదాలపల్లి మల్లేశం గౌడ్



నిరాహార దీక్ష చేస్తున్న నాయకులు

పరకాల : ఉద్యోగాల భర్తీలో సీఎం కేసీఆర్ విఫలమయ్యారని వైఎస్సార్‌టీపీ పరకాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆముదాలపల్లి మల్లేశం గౌడ్ విమర్శించారు. టీ–సేవ్ ఫోరం ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్త ఆందోళనలో భాగంగా పట్టణంలోని బస్టాండ్ ఎదుట శనివారం చేపట్టిన నిరాహార దీక్షను సీనియర్ సిటిజన్ స్వర్గం ధనుంజయ ప్రారంభించారు. దీక్ష అనంతరం ధనుంజయ నిమ్మరం అందించి ఆందోళన విరమింపజేశారు. ఈ సందర్భంగా మల్లేశం మాట్లాడారు. స్వరాష్ట్ర సాధనతో ప్రభుత్వ ఉద్యోగాలు దొరికి బతుకులు బాగుపడతాయని ఆశించి అనేక మంది యువకులు ప్రాణత్యాగాలకు ఒడిగట్టిన విషయాన్ని గుర్తు చేశారు. తెలంగాణలో అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ తొమ్మిదేళ్ల గడచినా ప్రభుత్వ ఉద్యోగ ఖాళీల భర్తీ చేపట్టకుండా మోసపూరిత విధానాలతో పబ్బం గడుపుతోందని మండిపడ్డారు. ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసే వరకు పోరాటాలు కొనసాగిస్తామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ మోసపూరిత విధానాలపై పార్టీ ఆధ్వర్యంలో ప్రజలను, యువతను చైతన్యవంతం చేసి రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆ పార్టీ పరకాల, నడికూడ, ఆత్మకూరు, సంగెం మండల అధ్యక్షులు పుట్ట ఓంకార్, జలుగురి రమేశ్, పోగుల సుధాకర్‌రెడ్డి, గుల్లపల్లి సురేందర్, గీసుకొండ మండల నాయకుడు రుద్రరాపు సురేశ్, యువజన విభాగం పరకాల పట్టణ అధ్యక్షుడు బులుగోతు బాలకృష్ణ, నాయకులు చుక్క రవి, దండు సుధాకర్ పాల్గొన్నారు.

పేదలందరికీ ఇళ్లు నిర్మించి ఇస్తాం

● టీపీసీసీ సభ్యుడు గండ్ర సత్యనారాయణ



సత్యనారాయణకు స్వాగతం పలుకుతున్న మహిళ

శాయంపేట : రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే పేదలందరికీ ఇళ్లు నిర్మించి ఇస్తామని టీపీసీసీ సభ్యుడు, భూపాలపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణరావు తెలిపారు. మండలంలోని గొల్లపల్లి, సూర్యనాయక్‌తండా, గంగిరేణిగూడెం, వసంతాపూర్, కొప్పుల గ్రామాల్లో ×హాథ్ సే హాథ్ జోడో× యాత్ర శనివారం చేపట్టగా ఇంటింటికీ తిరుగుతూ ప్రజల సమస్యలను తెలుసుకుంటూ రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలపై అవగాహన కల్పించేలా ముద్రించిన కరప్రతాలను పంపిణీ చేశారు. అనంతరం ఆయా గ్రామాల్లో పార్టీ జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సత్యనారాయణరావు మాట్లాడారు. సీఎం కేసీఆర్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొమ్మిదేళ్లు గడచినా బడుగులకు సంక్షేమం అందని ద్రాక్షగానే మిగిలిందని ఆందోళన వెలిబుచ్చారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే పల్లెల్లో విచ్చలవిడిగా బెల్ట్ షాపులు ఏర్పాటయ్యాయని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే బెల్ట్ షాపులను బంద్ చేయిస్తుందని, ప్రజలకు మెరుగైన పాలన అందిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి, నాయకులు మారెపెల్లి బుజ్జన్న, మారెపెల్లి రాజేందర్, చింతం రవి, దుబాసి కృష్ణమూర్తి, నిమ్మల రమేశ్, మారెపెల్లి కట్టయ్య, రాజు, పోతు కృష్ణమూర్తి, మిట్టపల్లి సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

'బీజేపీకి గుణపాఠం తప్పదు'



మాట్లాడుతున్న సత్యనారాయణరావు

పరకాల : రానున్న ఎన్నికల్లో బీజేపీకి గుణపాఠం తప్పదని బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా నాయకుడు సోదా రామకృష్ణ హెచ్చరించారు. సింగరేణి గనుల ప్రైవేటీకరించేలా కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న వైఖరిని నిరసిస్తూ సింగరేణి గనుల వద్ద నిరసన తెలిపేందుకు పార్టీ నాయకులు స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం నుంచి శనివారం బయల్దేరారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడారు. దేశంలోని అనేక ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరిస్తున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి రాబోయే రోజుల్లో ప్రజలు బుద్ధి చెబుతారన్నారు. తెలంగాణ పట్ల కేంద్ర ప్రభుత్వం వివక్షతను మానుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ రేగూరి విజయ్‌పాల్‌రెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ పరకాల పట్టణ అధ్యక్షుడు మడికొండ శ్రీను, నడికూడ మండల అధ్యక్షుడు దురిశెట్టి చంద్రమౌళి, వైస్ ఎంపీపీ చింతిరెడ్డి మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత.. ఇద్దరి అరెస్ట్



నిందితులతో పోలీసులు

పరకాల : ఇద్దరు యువకులను అరెస్ట్ చేసి 1.150 కిలోల ఎండు గంజాయి స్వాధీనం చేసుకున్నట్టు సీఐ పుల్యాల కిషన్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. టాస్క్‌ఫోర్స్ పోలీసులతో కలిసి భూపాలపల్లి రోడ్డులోని ఇండియన్ అయిల్ పెట్రోల్ బంక్ వద్ద శుక్రవారం సాయంత్రం వాహనాలు తనిఖీ చేస్తుండగా మోటార్ సైకిల్‌పై వస్తున్న జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండల పొనగల్లు గ్రామానికి చెందిన గంపాల స్వామి(24), మొరంచపల్లి గ్రామానికి చెందిన ర్యాకం శ్రావణ్ అనుమానస్పదంగా కనిపించడంతో వారిని తనిఖీ చేయగా తెల్లని సంచిలో ఎండు గంజాయి లభించింది. సిలేరులో గుర్తుతెలియని వ్యక్తుల వద్ద కొనుగోలు చేసి గంజాయికి బానిసైన యువకులకు ఎక్కువ ధరకు విక్రయిస్తున్నట్లు పట్టుబడిన ఇద్దరు తెలుపటంతో వారిని అరెస్ట్ చేశారు. ఇద్దరినీ కోర్టులో హాజరుపర్చుతామని సీఐ తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై బి.హరికృష్ణ, పోలీసు కానిస్టేబుల్స్ రాజ్‌కుమార్, నాగరాజు, దేవేందర్, కృష్ణకుమార్ పాల్గొన్నారు.

సైకాలజిస్ట్స్ అసోసియేషన్ కమిటీల ఎన్నిక



కమిటీని ప్రకటిస్తున్న మురళీధర్‌రావు

న్యూశాయంపేట: సైకాలజిస్ట్స్ అసోసియేషన్ వరంగల్, హనుమకొండ జిల్లాల కమిటీలను ఎన్నుకున్నారు. తెలంగాణ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ (టీపీఏ) వరంగల్ జిల్లా నూతన కమిటీని సైన్స్ సెంటర్‌లో అసోసియేషన్ రాష్ట్ర ప్రతినిధి మురళీధర్ రావు ఆధ్వర్యంలో శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బి.మిధున్‌గౌడ్, ఉపాధ్యక్షులుగా కె.సృజనారెడ్డి, ఎస్.నాగలక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా బొజ్జ సురేష్, సహాయ కార్యదర్శులుగా పోగు అశోక్, జి.గోవర్ధన్, కోశాధికారిగా శ్రీనివాస్, సభ్యుడిగా రంజిత్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో హనుమకొండ ప్రతినిధి శ్యామ్ సుందర్‌రెడ్డి ఉన్నారు.

కాజీపేట అర్బన్: హనుమకొండ హంటర్‌రోడ్డులోని రీజినల్ సైన్స్ సెంటర్‌లో తెలంగాణ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ హనుమకొండ జిల్లా నూతన కమిటీని శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా డాక్టర్ గంగిశెట్టి శ్రీవిద్య, ప్రధాన కార్యదర్శిగా శ్యాం సుందర్, ఉపాధ్యక్షుడిగా శివుడు, ఉప కార్యదర్శిగా దామోదర్, కోశాధికారిగా ఈసీ మెంబర్లు శంకర్, సునీత, మురళీధర్, దేవేందర్, స్నేహ, సాజియా, తదితరులను ఎన్నుకున్నారు.

గ్రేటర్ వరంగల్‌కు కమిషనర్‌ను నియమించండి

వరంగల్ అర్బన్: గ్రేటర్ వరంగల్‌కు వెంటనే ఐఏఎస్ కమిషనర్‌ను నియమించాలని బీజేపీ వరంగల్ ప్రధాన కార్యదర్శి బాకం హరిశంకర్ డిమాండ్ చేశారు. ఈమేరకు రాష్ట్ర పురపాలక శాఖ కమిషనర్ అండ్ డైరెక్టర్‌కు శనివారం దరఖాస్తు అందజేశారు. తెలంగాణలో రెండో పెద్ద నగరమైన వరంగల్‌కు కమిషనర్ లేకపోవడం వల్ల అనేక అభివృద్ధి పనులు ఆగిపోయాయని, పరిపాలన అస్తవ్యస్తంగా మారిందని పేర్కొన్నారు.